క్లుప్తంగా

సీఓఈలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల(సీఓఈ)లో ఇంటర్ ప్రథమ సంవత్సరం (2024–25) ఎంపీసీ, బైపీసీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దేవదాసు తెలిపారు. ఈ ఏడాది మార్చిలో పదో తరగతి వార్షిక పరీక్షలు రాయనున్న గిరిజన బాలబాలికలు రూ.200 చెల్లించి ఆన్‌లైన్ ద్వారా ఫిబ్రవరి 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంగ్లిష్ మీడియంలో బోధనతో పాటు ఐఐటీ, జేఈఈ, నీట్‌కు ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు.

గడపగడపకూ రథయాత్ర


జెండాలను అందజేస్తున్న గౌరీశంకర్

దుమ్ముగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరాముడి రథయాత్ర గురువారం నిర్వహించారు. లక్ష్మీనగరం గ్రామంలో శ్రీదాసాంజనేయ ఆలయ అర్చకుడు అరుట్ల రాజగోపాల్ చార్యులు.. రథంలోని శ్రీకోదండరాముని ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం లక్ష్మీనగరం పురవీధుల గుండా గడపగడపకు రథాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

జెండాలు పంపిణీ..

అయోధ్యలో ఈ నెల 22వ తేదీన శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని లక్ష్మీనగరం గ్రామానికి చెందిన వాకచర్ల గౌరీశంకర్–సుధారాణి దంపతులు శ్రీరాముని జెండాలను పంపిణీ చేశారు. లక్ష్మీనగరం గ్రామంలో ప్రతి ఇంటికీ జెండాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శిరపు వీరరాఘవరెడ్డి, టీటీడీ మండల ప్రచారక్ పిలకా నాగేందర్‌రెడ్డి, పిలక వెంకటరమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి వాలీబాల్ పోటీలు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21, 22, 23 తేదీల్లో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు సీఐ దోమల రమేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ములకపాడు ఆస్పత్రి వెనుక ఉన్న క్రీడా మైదానంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నామని, ఈ పోటీలకు ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదని తెలిపారు. పోటీలలో మండలానికి చెందిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలని, నేషనల్ క్రీడాకారులు ఆడేందుకు అవకాశం లేదని వెల్లడించారు. నిర్వాహక కమిటీ తుది నిర్ణయం మేరకే పోటీల నిర్వహణ జరుగుతుందని తెలిపారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఫైనల్‌కు చేరిన జట్లకు ఉచితంగా స్పోర్ట్స్ డ్రస్ అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎస్సై పి.కేశవరావు 9573871492, కృష్ణయ్య హెడ్‌కానిస్టేబుల్ 8712566478, పృథ్వీ కానిస్టేబుల్ 9704190229, కృష్ణారావు కానిస్టేబుల్ 8008865351 సంప్రదించాలని కోరారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ

మణుగూరురూరల్: అయోధ్యలో సీతారామచంద్రుల విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలను రామదండు భక్తులు గురువారం మణుగూరులోని పలువురు అధికారులకు పంపిణీ చేశారు. మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు, మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, సీఐ రమాకాంత్, ఎస్సైలు శ్రీనివాస్, రాజేష్‌కుమార్‌లకు ఈ అక్షింతలను భక్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు శేషగిరిశర్మ, జి.వెంకటేశ్వరరావు, చంద్రమౌళి, రఘు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు వితరణ

దుమ్ముగూడెం: మండలంలోని మారాయిగూడెం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై సర్వస్వం కోల్పోయిన కారం రామకృష్ణ కుటుంబానికి గురువారం పలువురు వితరణ అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య, సర్పంచ్ తొడం తిరుపతిరావులు పరామర్శించి నిత్యావసర సరుకులు, 50 కేజీల బియ్యం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, ఎంపీపీ రేసులక్ష్మి బాధిత కుటుంబానికి అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన దేవర బాలలు సోడి శాంతమ్మ, మడకం అచ్చమ్మలు బాధిత కుటుంబానికి నగదు, దుస్తులు, నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అపాక వీర్రాజు, సలీం, కారం పుల్లయ్య, రామారావు, వర్మ, ధర్మయ్య,నగేష్, బీఆర్ఎస్ కార్యదర్శి కణితి రాముడు, ఉపాధ్యక్షులు తునికి కామేశ్వరరావు, సీనియర్ నాయకుడు కొత్తూరి, సీతారామారావు, మడకం వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతు చిత్తు..

- వర్షాలు లేక తగ్గిన దిగుబడి
- మద్దతు ధర వచ్చినా పూడని నష్టం
- ఆందోళనలో రైతులు


వెంకటాపురం గ్రామంలోని ఎదుగుదల లేని పత్తి చేను

కష్టాల సాగులో పత్తి రైతులు నష్టాల పాలవుతున్నారు. అడుగడుగునా దగా పడుతున్నారు. విత్తు సమయంలో వరుణుడు కరుణించక కన్నీటి పర్యంతమయి ఆకాశానికేసి దిక్కులు చూశారు. ఆ తరువాత వర్షాలు లేక దిగాలు చెందారు. అనంతరం చేతికొచ్చిన పంటలను అకాల వర్షాల నుంచి కాపాడుకోవడానికి పరుగులు పెట్టారు. చివరికి విపణికి వెళ్లి మార్కెట్ మాయాజాలంలో పడి గిలగిల లాడుతున్నారు. ఈ క్రమంలో మద్దతు లభించక 'తెల్ల'బోతున్నారు.

కరకగూడెం: మొన్నటి వరకు తేమను బూచిగా చూపి పత్తిని కొనేందుకు నిరాకరించిన అధికారులు.. ఇప్పుడు నాణ్యత లేదంటూ పలు చోట్ల దూదిని దూరంగా పెడుతున్నారు. వ్యయ ప్రయాసలు కోర్చి సాగు చేసి హలధారులు ఆగమవుతున్నారు. ఆరుగాలం శ్రమించే అన్నదాతలను ప్రకృతి కూడా కనికరించడం లేదు. కోటి ఆశలతో సాగు చేస్తే పత్తి ముంచింది. శ్రమకోర్చి సాగుచేసిన పైరును కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చినా తీరా చేతికందే దశలో వాతావరణ మార్పు పంట పాలిట శాపమైంది. వచ్చిపోయే వానల కన్నా మరో కాత రాకపోతుందా అని ఆశించిన అన్నదాతను దోమ, గోధుమ రంగు పేను ఉధృతి పైరును చంపేసింది. మండలంలోని మెట్ట పంటల కన్నా పత్తి సాగే మేలని భావించి 2750 హెక్టార్ల పత్తి పంటను రైతులు సాగు చేశారు. పలు గ్రామాల్లోఇదే ప్రధాన సాగుగా మారింది. ఈ క్రమంలో ముప్పేట దాడి చేసిన తెగుళ్లతో రైతులు లబోదిబోమన్నారు.

ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి

వర్షాధారంగా సాగుచేసే పత్తికి ఎకరాకు అన్ని ఖర్చులు కలుపుకొని రైతులు రూ.30వేలు వెచ్చించారు. ఇందులో దుక్కి దున్ని విత్తనాలు వేసేందుకు ఎకరాకు 10 వేల వరకు ఖర్చు చేశారు. విత్తనానికి రూ.3వేలు, కూలీల ఖర్చులకు రూ.5వేలు పెట్టుబడి పెట్టారు. ఎరువులకు 7వేలు దోమ, పేను నివారణకు ఇప్పటికే మూడుసార్లు రూ.5వేలు వెచ్చించారు. మొత్తంగా ఎకరాకు రూ.30వేలు పెట్టుబడి పెడితే రైతుకు మూడు నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే అందేలా ఉంది. దీనికి మద్దతు ధర రూ.6,500 లభించినా ఇంకా అసలు పెట్టుబడిలోనే నష్టపోవాల్సిన పరిస్థితి తలెత్తిందని పలువురు రైతులు వాపోతున్నారు. పత్తిసాగుతో తీవ్రంగా నష్టాల పాలైన తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారుకోరుతున్నారు.

మండలంలోని పద్మాపురం, మోగిలితోగూ, రేగళ్ల, పడిగాపురం, వీరాపురం, బుర్దారం, వెంకటాపురం, కొత్తూర్, గొల్లగూడెం తదితర గ్రామాల్లో గిరిజనులు అధికంగా పోడు భూముల్లో పత్తి సాగు చేశారు. ఈ క్రమంలో తగిన సమయానికి వర్షాలు పడకపోవడంతో పత్తి దిగుబడి తగ్గింది.

పెట్టుబడి కూడా రావడంలేదు



నేను రెండెకరాల్లో పత్తి సాగు చేశా. రూ.60 వేల పెట్టుబడి పెట్టాను. వర్షాలు కురవకపోవడంతో పాటు పంటకు తెగుళ్లు సోకి పూత రాలింది. మొక్కల పెరుగుదల నిలిచిపోయి గిడసబారిపోయింది. పంటకు నష్టం జరిగింది. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

– పోలెబోయిన నర్సింహారావు, రైతు, వెంకటాపురం

కష్టాలే మిగిలాయి..



నాలుగు ఎకరాల్లో పత్తి పంట వేశాను. రూ.55 నుంచి 60 వేల వరకు పెట్టుబడి పెట్టాను. ప్రారంభంలోనే పంటకు తెగుళ్లు సోకి మొక్కల ఎదుగు నిలిచిపోయింది. చలికి ఆకులు ఎండిపోతున్నాయి. పంట సాగుకు నీటి సమస్య ఉంది. ఆశించిన దిగుబడి రాలేదు దీంతో తీవ్ర ఆందోళన చెందాం. ప్రభుత్వమే ఆదుకోని సాయం చేయాలి.

– ఇర్ప సత్యమ్మ, రైతు, కొత్తూరు

అప్పులు తీరేలా లేవు



ఈ ఏడాది పత్తి సాగు భారంగా మారింది. ఏకధాటిగా కురిసిన వర్షాలతో పత్తి ఏపుగా పెరగలేదు. పత్తికి తెగుళ్లు వ్యాపించి దిగుబడి అమాంతం తగ్గింది. పంట సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా వస్తాయో రావోనన్న అనుమానాలు ఉన్నాయి. ఏటా ప్రకృతి వైపరీత్యాలతో పంటలకు నష్టం వాటిల్లుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

– ఈసం శ్రీను, రైతు, దేవరనాగరం

'ఐలు' క్యాలెండర్లు ఆవిష్కరణ


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు

మణుగూరురూరల్: ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ (ఐలు) ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరం క్యాలెండర్లను మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు న్యాయసేవలను అందుబాటులోకి తీసుకెళ్లాలని అన్నారు. ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.శ్రీనివాస్, న్యాయవాదులు కిషన్‌రావు, కె.నరసింహరావు, పి.భాస్కర్, విజయ్‌రావు, సర్వేశ్వరరావు, పద్మావతి, సంధ్య, శైలజ, కవిత, వాసవి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయాల్లో పూజలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం, అశ్వారావుపేటలోని షిరిడి సాయిబాబా ఆలయాల్లో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. సాయిబాబాను దర్శించుకుని వివిధ రకాల పూజలు చేశారు. క్షీరాభిషేకాలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అలాగే బాబాకు పల్లకి సేవలు అందించి, భజనలు చేశారు. మధ్యాహ్న సమయంలో ఆలయాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

అన్నదానం..

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

యలగల రంగారావు–ఉష దంపతులు, వారి కుటుంబ సభ్యులు సహకారంతో ఆలయ కమిటీ వారు ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించి తరించారు. అన్నప్రసాద దాత రంగారావు దంపతులను ఆలయ కమిటీ వారు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకుడు పవన్ కుమార్ వర్మ, భక్తులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి

దమ్మపేట: నూతన ముసాయిదా ఓటరు జాబితాను మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించామని, ఆ జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని తహసీల్దార్ ఎండి.ముజాహిద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో (శని, ఆది వారాలు) పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు, అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉన్నవారు, దరఖాస్తులను బూత్ స్థాయి అధికారులకు అందజేయాలని సూచించారు.

టెండర్ల ఆహ్వానం

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీ గనిలో వాహనాల నిర్వహణ కోసం టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఏరియా డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాన్ ఏసీ 4 డబ్ల్యూడీ వన్ టన్ సామర్థ్యం ఉన్న ఫోర్ ప్లస్ వన్ సీటింగ్ సికప్ వ్యాన్‌ను మూడు సంవత్సరాల కాలపరిమితితో రోజుకు 12గంటల చొప్పున వెయ్యి కిలోమీటర్లు నడిపే విధంగా ఈ టెండర్‌ను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఏరియాలోని ఓసీ ప్రభావిత, భూనిర్వాసిత, సింగరేణి మాజీ ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలు ఈ టెండర్లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులు, పూర్తి వివరాల కోసం జీఎం కార్యాలయంలోని పర్చేస్ విభాగంలో సంప్రదించాలని తెలిపారు.

ఎమ్మెల్యే పర్యటన

దమ్మపేట: మండలంలో సుడిగాలి పర్యటన చేసిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గురువారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని నాయుడుపేట గ్రామంలో జంక్షన్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఎన్టీఆర్ సినీ రంగంలో, సీఎం రాష్ట్రానికి సేవలను కొనియాడారు. మొద్దులగూడెం గ్రామంలో ఇటీవలే ప్రమాదంలో గాయపడిన జీలుగు కాంతారావును పరామర్శించి తగు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాటుగా స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

చంద్రుగొండ: అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలకేంద్రం చంద్రుగొండలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ బాణోత్ పార్వతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ అధికారి, సిబ్బంది సమయపాలన పాటించడంతోపాటు విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మద్దుకూరు, తిప్పనపల్లి, రావికంపాడు గ్రామాల్లో మంచినీటి సమస్య ఉందని ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యపై సత్వరమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శాఖాధికారులను ఆదేశించారు. రాబోవుకాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు సూచన చేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారం రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం ప్రభుత్వం అందిస్తుందని అందుకు సంబంధించిన సూచికబోర్డును పీహెచ్‌సీలో ఏర్పాటు చేయాలని వైద్యాధికారిణి తనుజకు సూచించారు. సమావేశంలో మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు, ఎంపీడీఓ జి.రేవతి, జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, ఎంఈఓ ఎస్ సత్యనారాయణ, వివిధ శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పరామర్శ..

అన్నపురెడ్డిపల్లి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అబ్బుగూడెం గ్రామానికి చెందిన చిన్న వెంకటి కుటుంబ సభ్యులను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గురువారం పరామర్శించి, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మారకాల లక్ష్మారెడ్డి, చెరుకూరి రవి తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

దుమ్ముగూడెం: త్వరలో జరగనున్న వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికల్లో పాల్గొనేందుకు దుమ్ముగూడెం పట్టభద్రులను గ్రాడ్యుయేట్ ఓటు నమోదు చేసుకోవాల్సిందిగా తహసీల్దార్ చంద్రశేఖర్ గురువారం ఓప్రకటనలో కోరారు. ఇంతకు ముందు నమోదు చేసుకున్న వారు కూడా మరలా పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవాల్సి ఉందని తెలిపారు. ఓటు హక్కు నమోదుకు నవంబర్ 1, 2020 కంటే ముందుగా పట్టభద్రులై ఉన్నవారు అర్హులని తెలిపారు. ఓటు నమోదు చేసుకోవడానికి చివరి తేదీ ఫిబ్రవరి 6గా ప్రకటించారు. ఓటు నమోదు చేసుకోవడానికి ఓటర్ కార్డ్ (ఎపిక్ నంబర్), ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, డిగ్రీ లేదా డిప్లమో సర్టిఫికెట్, మొబైల్ నంబర్, ఈమెయిల్ ఐడీ ఉండాలని, నమోదును ఆన్లైన్ లేదా ఆఫ్‌లైన్ రెండు విధాలుగా చేసుకోవచ్చని తెలిపారు. వివరాలు నింపిన అప్లికేషన్ (ఫాం–18)తో పాటు పైన పేర్కొన్న పత్రాలు జిరాక్స్ కాపీ జతచేసి జిల్లా కలెక్టర్, భద్రాద్రి, సహాయ ఓటర్ నమోదు అధికారి తహసీల్దార్ దుమ్ముగూడెం, డెసిగ్నేటెడ్ అధికారిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి, దుమ్ముగూడెంకు అందజేయాలని సూచించారు.

కరకగూడెం: ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలని కరకగూడెం తహసీల్దార్ కె.చంద్రశేఖర్ సూచించారు. ఈ మేరకు ఆయన గురువారం స్థానిక తహసీల్లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ.. 2020 సంవత్సరం నాటికి డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునేటప్పుడు డిగ్రీ ఒరిజినల్ మెమో, ఆధార్ కార్డు, ఓటర్ ఐడి కార్డు, పాస్ ఫోటో అందించాలన్నారు. అంతేకాకుండా ఆన్లైన్లో దరఖాస్తు చేసిన పత్రాలపై గేజిటెడ్ సంతకం చేయించి తహసీల్దార్ కార్యాలయంలో అందజేయలన్నారు. గతంలో ఓటు హక్కు కలిగి ఉన్న పట్టుబద్రులు ఫామ్ 18 ద్వారా మళ్లీ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ తాతారావు

కరకగూడెం: మండలంలోని పలు ఎరువుల దుకాణాలను గురువారం మణుగూరు డివిజన్ ఏడీఏ తాతారావు ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన దుకాణాల్లోని పలు రికార్డులను పరిశీలించి మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన యూరియాతోపాటు అన్నిరకాల ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రైవేటు డీలర్లు యూరియా కృత్రిమ కొరత సృష్టించినా, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువుల నిల్వ అమ్మకాలు, ఈ పాస్ యంత్రంలో నమోదైన రైతుల వివరాలు, గోదాంలోని ఎరువులు, పురుగు మందుల నిల్వలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే వ్యాపారుల లైసెన్స్‌లు రద్దు చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏఈఓ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం పలు చోట్ల కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కొన్నిచోట్ల ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ నాయకులు అన్నదానం నిర్వహించారు. తెలుగు ప్రజల హృదయాల్లో ఆయన ఎప్పటికీ అమరుడిగా నిలిచిపోతారని పలువురు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్


దమ్మపేట: ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా


భద్రాచలంటౌన్: ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు


అశ్వాపురం: విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ముగిసిన క్రికెట్ టోర్నీ


విజేత జట్టుకు ట్రోఫీని అందిస్తున్న జెడ్పీటీసీ శ్రీలత తదితరులు

బూర్గంపాడు: లక్ష్మీపురం గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 3వ సతీష్‌రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. చివరిరోజు జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సతీష్ ఎలెవన్ జట్టు 12 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 69 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బూర్గంపాడు మణి ఎలెవన్ జట్టు 8.4 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 70 పరుగులు చేసి విజయం సాధించింది. మణి ఎలెవన్ జట్టులోని సింగ్ 49 పరుగులు చేయటంతో పాటుగా రెండు వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో విన్నర్ జట్టుకు రూ.20 నగదు బహుమతి, ట్రోఫీని, రన్నర్ జట్టుకు రూ.13వేల నగదు బహుమతి, ట్రోఫీలను అందజేశారు. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పోతిరెడ్డి గోవిందరెడ్డి, ఆవుల నాగార్జునరెడ్డి, కన్నెకంటి యాకుబ్‌రెడ్డి, ఇలవాల రాజశేఖర్‌రెడ్డి, పాలం దివాకర్‌రెడ్డి, బాదం గణేష్‌రెడ్డి, యారం పున్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా యోగా కేంద్రం

- నిర్మాణానికి రూ.6 లక్షలు కేటాయింపు
- ఐదు నెలల క్రితమే నిర్మాణం పూర్తి
- అయినా అందని ఉచిత యోగా సేవలు



భద్రాచలం ఏరియా ఆస్పత్రి ఆవరణలోని యోగా కేంద్రం

భద్రాచలంఅర్బన్: పట్టణాలు, పల్లెల ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలని కేంద్ర ప్రభుత్వం ఉచితంగా యోగాను అందించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇందుకోసం ఆయుష్ మిషన్ ద్వారా ఆయుష్ వైద్య ఆరోగ్య కేంద్రాల్లో యోగా కేంద్రాలను మంజూరు చేసింది. దీనిలో భాగంగా భద్రాచలం ఏరియా ఆస్పత్రి పరిధిలోని ఆయుష్ ఆస్పత్రికి అనుబంధంగా నిర్మించిన యోగా కేంద్రం నిర్మాణం పూర్తి అయింది. అప్పటి భద్రాచలం ఎమ్మెల్యే వీరయ్య దీనిని ప్రారంభించారు. కానీ ప్రజలకు ఈ కేంద్రం అందుబాటులోకి రాకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ యోగా కేంద్రాలకు భారీగా ఖర్చు చేస్తున్నారు. ఒక్కొక్క యోగా కేంద్రం షెడ్ నిర్మాణానికి రూ.6 లక్షల వరకు వెచ్చించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్మాణ బాధ్యతలను ఆర్అండ్‌బీ, పీఆర్, టీఎస్ఎంఐడీసీలకు అప్పగించారు. దీనిలో భాగంగా భద్రాచలంకు ఒకటి మంజూరు అయినప్పటికీ ఉపయోగం లేకుండాపోయింది. తొలుత ప్రతీ యోగా కేంద్రానికి ఇద్దరు ఆశా వర్కర్లకు శిక్షణ ఇప్పించాలని భావించారు. ఇప్పటి వరకు ఆశావర్కర్లను ఎంపిక చేయలేదు. వారికి ఎలాంటి శిక్షణా ఇప్పించలేదు.

నెలలు గడుస్తున్నా..

యోగా శిక్షణ కోసం భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో నిర్మించిన షెడ్డు పూర్తయినప్పటికీ యోగా శిక్షకులను నియమించకపోవడంతో అది తెరచుకోవడం లేదు. యోగా శిక్షణ కోసం నిర్మించిన షెడ్డు వినియోగంలో లేకపోవడంతో భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన షెడ్ చుట్టూ పక్కల పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి యోగా శిక్షణ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఇందుకు సంబంధించి సాక్షి సంబంధిత అధికారుల వివరణ కొరగా వీలైనంత త్వరగా యోగా శిక్షణ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకుని వస్తామని, ఇందుకు సంబంధిత ఆశా వర్కర్లను నియమించనున్నట్లు వివరణ ఇచ్చారు.